వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై 705 ఫిర్యాదులకు 669 పరిష్కారం

- రూ. 1.19 కోట్లు విలువైన నగదు లిక్కర్ ఇతర వస్తువులు సీజ్
- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్



## తనపై చంద్రబాబు చేసిన విమర్శలు నిజమని భావిస్తు ఓటు వేయకండి

విమర్శలు అబద్దమని భావిస్తే ఓటు వేసి గెలిపించండి ప్రజలకు విజ్ఞప్తి చేసిన వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాచమల్లు



## సిద్ధ సభను జయప్రదం చేయండి

### రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మదనపల్లె, మార్చి 31 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2న మంగళవారం సాయంత్రం కదిరిరోడ్డులోని టిప్పుసుల్తాన్ మైదానంలో నిర్వహించే మేము సిద్ధం సభను జయప్రదం చేయాలని రాష్ట్ర విద్యుత్, భూగర్భగణుల, అటవీశాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం టిప్పుసుల్తాన్ మైదానంలోని సభా ప్రాంగణ ఏర్పాట్లును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సిద్ధం సభకు వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలన్నారు. 1న సోమవారం సాయంత్రం అన్నమయ్యజిల్లాలోకి ముఖ్యమంత్రి ప్రవేశిస్తారన్నారు. సోమవారం రాత్రి మొలకలచెరువులో ముఖ్యమంత్రి బసచేసి, మంగళవారం బస్సుయాత్ర ద్వారా మదనపల్లెలో జరిగే సిద్ధం సభకు చేరుకోవడం జరుగుతుందన్నారు. సభా ముగింపు అనంతరం చిత్తూరుజిల్లాలోని పుంగనూరుకు చేరుకొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట వైకాపా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజసంపద ఛైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ ఛైర్మెన్ జింకాచలపతి, వైకాపా యువ నాయకులు శశాంక్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, జడ్పిటిసిలు పాల్గొన్నారు.

# వాలంటీర్లకు చెక్...!




- సార్వత్రిక ఎన్నికల్లో వాలంటీర్లకు ఆంక్షలు
- సెల్‌ఫోన్‌తో ఇతర పరికరాలు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు
- కొత్త ప్రభుత్వం వచ్చే వరకు వాలంటీర్ల సేవలకు మంగళం

రాయచోటి, మార్చి 31, ప్రభాత వార్త :

సార్వత్రిక ఎన్నికల్లో వాలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది . ఎలాంటి సంక్షేమ పథకాలకు వాలంటీర్ల చేత డబ్బు పంపిణీ చేయించవద్దని ఆదేశాలు జారీ చేసింది. దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన క్రమంలో కోడ్ అమలులో ఉంది. ఈ కోడ్ ప్రభావం సచివాలయ వ్యవస్థలో పని చేసే వాలంటీర్లపై పడింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలు నేరుగా అందజేసేందుకు ఈ వ్యవస్థను రూపొందించారు. ఈ తరుణంలో ఓటర్లపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతారని టిడిపి నేత వర్ల రామయ్య, నిమ్మగడ్డ రమేష్ ఎన్నికల కమిషన్ వద్ద ఫిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఫిటిషన్‌ను స్వీకరించిన ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఎన్నికల కమిషన్ వాలంటీర్లపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు వాలంటీర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్‌లు, ఇతర పరికరాలు స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ రూల్స్ ఈ క్షణం నుంచే అమలు కానున్నట్లు తెలిపింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏపి ప్రభుత్వాన్ని సూచించింది. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈసిఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. పెన్షన్ల పంపిణీకి కూడా వాలంటీర్లను ఉపయోగించవద్దని ప్రత్యేకంగా తెలిపింది. అవసరం అనుకుంటే ప్రభుత్వ సిబ్బందిని ఈ సేవలకు వాడుకోవాలని సూచించింది. దీంతో సచివాలయ సిబ్బందిని పంపిస్తారా లేక ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందో అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది

## స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబుతోనే సాధ్యం

- జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రివర్స్.
.- శ్రీనివాసరెడ్డి, మాధవిరెడ్డి



కడప వైద్యవిభాగం, మార్చి 31, ప్రభాతవార్త:

శ్రీకాళహస్తిలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబునాయుడు తనను తాను డ్రైవరుగా అభివర్ణించి ప్రజలను రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే బాధ్యత తీసుకుంటానని చెప్పారని కడప పార్లమెంటు అధ్యక్షులు పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవిరెడ్డిలు అన్నారు. జగన్ అసమర్థ, అవినీతి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. యువత, భవిత బాబుతోనే సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్ ప్రయాణానికి అనుభవం ఉన్న డ్రైవర్‌గా మారి అభివృద్ధి వైపు మిమ్మల్ని తీసుకెళ్తానన్న బాబు హామీ తప్పక నెరవేరుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## వలసపల్లెలో టిడిపి ఎన్నికల ప్రచారం

### గెలిపించాలంటూ షాజహాన్‌బాషా అభ్యర్థన



మదనపల్లె, మార్చి 31 ప్రభాతవార్త :

రూరల్ మండలంలోని వలసపల్లె గ్రామ పంచాయితీలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలతో ముఖాముచ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా షాజహాన్‌బాషా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలంటూ ప్రజలను కోరారు. గత ఐదేళ్ళుగా వైకాపా అరాచకాలు ఎక్కువై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తేనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. టిడిపిని ఆదరించి మళ్ళీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును గెలిపించాలని కోరారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో వైకాపాకు బుద్ధిచెప్పి టిడిపిని గెలిపించాలన్నారు. అందరికి అందుబాటులో ఉండే షాజహాన్‌బాషా ఎమ్మెల్యేగా గెలిపొందితే నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనసేన నాయకులు రామాంజనేయులు, ఆర్‌జె.వెంకటేష్, గుర్రప్పనాయుడు, దొరస్వామినాయుడు, పెంచుపాడు స్వామి, మాజీ సర్పంచ్ తిరుమలప్ప, స్టోర్ రమణ, చెంగారెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలి

### కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్ రెడ్డి



ముద్దనూరు, మార్చి 31, ప్రభాతవార్త:

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను పార్లమెంట్ అభ్యర్థిగా గెలిపించాలని కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్ రెడ్డిఅన్నారు. ఆదివారం నాడు ఎర్రగుంట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల మరియు మున్సిపాలిటీ తెలుగుదేవం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయనమాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు జిల్లాల్లో తమ బంధువులందరికి తెలియజేసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించి గెలిపించాలన్నారు. ఈ సైకో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని జిల్లాలో మార్పుకోరి తనకు ఒకసారి పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని, యువతకు ఉపాధి రావాలంటే కడప స్టీల్‌ప్లాంట్ పూర్తిచేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జగనన్న సంక్షేమ పథకాలతో శిబ్యాలలో ఆనందహేళ..

### - ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి గ్రామీణ, మార్చి 31, ప్రభాతవార్త: జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం అందించి పల్లె పల్లెనా అభివృద్ధి అడుగులు వేసిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి రూరల్ మండలం శిబ్యాల గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని గువ్వల హరిజనవాడ, వడ్డెపల్లె, పోల్‌రెడ్డిగారిపల్లె, మంగళపల్లె, పాత అనుంపల్లె రోడ్డులో అనుంపల్లె, భోగ్యంపల్లె, మల్లయ్యగుంటపల్లె తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ ఫలాల కోసం జగనన్నను మరో సారి ఆశీర్వదించాలని కోరారు. అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతించి ఆత్మీయ, ఆదరాభిమానాల మధ్య భారీ జన సందోహం మధ్య ఆయన ప్రచారం సాగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మూడింటికే విధులకు దూరం

- వచ్చిన రోగులకు సిబ్బందే దిక్కు- ఇబ్బంది పడుతున్న రోగులు
- చిట్వేలి పీహెచ్‌సీ తీరుపై సర్వత్రా విమర్శలు




చిట్వేలి, మార్చి 31, ప్రభాతవార్త:

చిట్వేలి ప్రాథమిక ఆసుపత్రిలో వైద్యుల తీరుపై మండల వ్యాప్తంగా సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. విధుల్లో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు 104 వాహనంలో విధులు నిర్వహిస్తున్నారు. మరొకరు పీహెచ్‌సీలో ఉంటూ వచ్చే రోగులకు సేవలు అందించాల్సి ఉంది. కాగా గతంలో జరిగిన ప్రమాదాలు, ఇబ్బందుల దృష్ట్యా మండల ప్రజలు ఉన్నతాధికారులను సంప్రదించగా ప్రజా ప్రతినిధుల జోక్యంతో వైద్యులను స్థానికంగానే నివాసం ఉండాలని సూచించారు. అంత వరకు బాగానే ఉన్నా ఉన్నతాధికారుల సూచనలు వైద్యులు పాటించడం లేదని ఉదయం 9 గంటలు మొదలు మధ్యాహ్నం 4 వరకు విధులు చేపట్టాలి. కాగా మూడింటికే విధుల నుంచి నిష్క్రమించి ఇంటికి బయలుదేరుతున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. సచివాలయాలలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌టీలు, ఆశా వర్కర్ల పనితీరుపై వైద్యుల పర్యవేక్షణ కొరవడిందని సిబ్బంది వారి ఇష్టానుసారం విధులు నిర్వహిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. చాప కింద నీరులా వ్యాపిస్తున్న క్షయ వ్యాధి గురించి, సీజనల్ వ్యాధుల పట్ల ఎలాంటి అవగాహన కార్యక్రమాలను చేపట్టకపోవడంపై, వ్యాధులను గుర్తించడంలో శ్రద్ధ చూపకపోవడం తదితర విషయాలలో చిట్వేలి పీహెచ్‌సీ నిర్లక్ష్య తీరు ఇట్టే అర్థమవుతోందని పలువురు మేధావులు వాపోతున్నారు. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా రోగ్యానికి పెద్దపీట వేస్తున్నప్పటికీ ఆచరణలో వైద్యులు, సిబ్బంది విఫలమవుతున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. వివరణ కోరేందుకు బాధ్యత అధికారిని సంప్రదించగా చరవాణికి స్పందించకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు దృష్టి సారించి చిట్వేలి పీహెచ్‌సీ తీరును బాగు చేయాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## తెలుగు పార్టీతోనే బిసిల అభ్యున్నతి

- ప్రజల్లో రాజకీయ చైతన్యం తెచ్చింది టిడిపినే
- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి, మార్చి 31, ప్రభాత వార్త

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎస్సీ, యఎస్టీ, బిసిల అభ్యున్నతి కోసం బిసిల ఆర్థిక సామాజిక రాజకీయ అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఎంతో కృషి చేస్తుందని రాయచోటి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి మండలం మాధవరం పంచాయతీలో ఆదివారం జరిగిన జయహో బిసి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ, జనసేన, ఎన్‌డిఎ కూటమితోనే బిసిల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. మాధవరంలో రాంప్రసాద్‌రెడ్డికి గ్రామ బిసిలు పూలమాలలు వేసి కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. వైసిపి ప్రభుత్వం బిసి రిజర్వేషన్ శాతాన్ని తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలకు అడ్డంకులు పడ్డారని గుర్తు చేశారు. బిసిల రిజర్వేషన్ శాతాన్ని మెరుగుపరిచేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బిసి ఆత్మగౌరవాన్ని ఎక్కడా తగ్గనివ్వనని, వారి వెంట నిలిచి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. మాధవరం గ్రామంలో వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలు నివసిస్తున్నాయని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగల్లు ప్రాజెక్టు నుండి సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే వ్యక్తిని కాదని ఆయన అన్నారు. వైసిపి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి బిసిలకు ఏం చేశారో చెప్పాలన్నారు. వైసిపి బానిస సంకెళ్ల నుండి బిసిలను విముక్తి కలిగిస్తానన్నారు. కార్యకర్తలకు, అభిమానులకు అండగా వున్నానని, పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారిని గుండెల్లో పెట్టుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, రంగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు హుసేన్ బాష, మైనార్టీ నాయకుడు రేపన శివప్రసాద్, బిజెపి యువమోర్చ వెంకటచంగయ్య, రామాంజులు, దుర్గాప్రసాద్, బెస్త సంఘం రెడ్డి వరప్రసాద్, రామాంజులు, మాజీ ఎంపిటీసీ రామ్‌నాథ్, రమేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లో ఉన్నాం

- పరిపాలనలో సంచలన మార్పులు తెచ్చిన జగనన్న
- మైక్రో ఇరిగేషన్‌తో ప్రతి చెరువుకు నీళ్లు
- సాగునీరు, పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మరోసారి నన్ను, జగనన్నను ఆశీర్వదించండి
- సింహాద్రిపురం, లింగాల ప్రచారంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పులివెందుల, మార్చి 31, ప్రభాతవార్త :

ప్రజలకు సేవ చేయడం కోసమే మేము రాజకీయాల్లో కొనసాగుతున్నామని, ఇచ్చిన హామీలను 100కు 100శాతం నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని, పరిపాలనలో సంచలన మార్పులు తెచ్చిన ఘనత జగనన్నదని, ఇరిగేషన్, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి చేసిన పనుల వలన ప్రతి చెరువుకు నేడు నీరు అందించిన గొప్ప నాయకుడు మన జగనన్న అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం భానుకోటలోని సోమేశ్వరస్వామికి, అంబకపల్లెలోని ఆవులస్వామికి ప్రత్యేక పూజలు చేసి సింహాద్రిపురం, లింగాల మండలాల్లో ఇంటింటికి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టినది ఒక్క జగనన్న మాత్రమేనని, సాగునీటి రంగంలో ప్రత్యేక దృష్టి పెట్టి నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు సాగునీరు అందేలా చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానిదే అన్నారు. పులివెందుల బ్రాంచి కెనాల్‌తో జీఎన్ఎస్ఎస్ కాలువకు అనుంధానం చేయడం ద్వారా పలు గ్రామాల చెరువులకు సాగునీరు అందించడం జరిగిందన్నారు. ముఖ్యంగా రూ.900కోట్లతో ఆర్ఎన్ఆర్ చెల్లింపులు చేయడం ద్వారా గండికోట నందు 23టీఎంసీల నీటిని మూడుసార్లు నింప గలిగామని, అలాగే చిత్రావతి రిజర్వాయరు నందు నాలుగు గ్రామాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆర్ఎన్ఆర్ కింద రూ.250కోట్లు చెల్లించి 10టీఎంసీల నీటిని మూడు దఫాలుగా నిల్వ ఉంచడం జరిగిందని, దీనివల్లనే నియోజకవర్గ వ్యాప్తంగా రెండు సంవత్సరాలుగా వర్షాలు లేకపోయినా సాగునీరు అందించడానికి సాధ్యమైందన్నారు. అంతేకాకుండా పులివెందుల, వేంపల్లె పట్టణాలను మహానగరాలకు ధీటుగా సుందరీకరణ , అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. వైఎస్ఆర్ ఆసరా, అమ్మఒడి, చేయూత, తదితర సంక్షేమ పథకాలను అమలు చేసి తండ్రిని మించిన నాయకుడిగా జగనన్న చరిత్రలో నిలిచారన్నారు. గత ఐదేళ్లుగా అవ్వ, తాతలకు వాలంటీర్ల ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, కానీ చంద్రబాబునాయుడు ఎన ఇనకల కమీషన్‌కు చేసిన ఫిర్యాదుతో వచ్చే రెండు నెలలు వాలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయరని, తద్వారా అవ్వ, తాతలు ఇబ్బందులు పడతారన్నారు. చంద్రబాబుకు ఖచ్చితంగా అవ్వ, తాతల శాపం తగులుతుందన్నారు. మేము ఈ ప్రభుత్వంలో చేసిన మంచిని చూసి మరోసారి ప్రజలందరు ఆశీర్వదించి నన్ను, జగనన్నను అఖండ మెజార్టీతో గెలిపించి మరోసారి సేవ చేసే భాగ్యం కల్పించాలని ప్రజలను కోరారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరితో ఆయన ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి, సింహాద్రిపురం మండల వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి శివ, మండల కన్వీనరు దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, అంబకపల్లె బాబురెడ్డి, వివిధ మండలాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఐకానిక్ అవార్డును అందుకున్న డాక్టర్ యోగేష్‌బాబు



పీలేరు, మార్చి 31 ప్రభాతవార్త: పట్టణానికి చెందిన డాక్టర్ యోగేష్‌బాబు తుంగ కు యుడొక్సియా , స్టెల్లార్ ఫిల్మ్స్ ముంబై వారు గ్లోబల్ ఐకానిక్ అవార్డును ప్రధానం చేశారు. ఈఅవార్డు డాక్టర్ యోగేష్‌బాబు తుంగ అకాడమిక్ , మానెజ్మెంట్ విభాగానికి గాను ఫైన్ ఆర్ట్సు మీడియా రీసెర్చు కమ్యూనికేషన్ రంగాలలో ఆయన అందించి విశేష కషిని గుర్తించి వారు ఈఅవార్డును ఇవ్వడం జరిగింది. ఈ అవార్డును మార్చి 30వ తేదీ యుడొక్సియా కామ్4- 2024 అంతర్జాతీయ కాన్ఫరెన్సు లో డాక్టర్ యోగేష్ కు ప్రధానం చేయడం జరిగింది. డాక్టర్ యోగేష్‌బాబు తుంగ ప్రస్తుతం యుడొక్సియా రీసెర్చు యూనివర్సిటీ లో పోస్టు డాక్టరల్ ఫెలోషిప్ చేస్తున్నారు. గతంలో కూడా ఆయన ఫైన్ ఆర్ట్సు మీడియా రీసెర్చు అండ్ కమ్యూనికేషన్ రంగాలలో చేసిన సేవలకు గాను పలు జాతీయ అంతర్జాతీయ స్తాయిలో అవార్డుల అందుకున్నారు. ఈసందర్బంగా పట్టణ ప్రముఖులు, బందువులు, శ్రేయోభిలాషులు, డాక్టర్ యోగేష్‌బాబును అభినందించారు. వీరి తండ్రి రాధాకష్ణయ్య, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను కళాకారులుగా తీర్చిదిద్దారు.

## లయన్సుక్లబ్ ఆధ్వర్యంలో పశువైద్యశిబిరం



పీలేరు,మార్చి 31 ప్రభాతవార్త: కేవి.పల్లె మండలంలోని జిల్లేళ్లమంద, దేవాండ్లపల్లెలో ఉచిత పశువైద్యశిబిరం లయన్సుక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. 70 ఆవులకు 40 గొర్రెలను పరిశీలించి వాటికి మందులను యజమానులకుఅందజేశారు. సుమారు రూ.15వేలు విలువ చేసే మందులను రేవూరి సుధీర్ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో లయన్సుక్లబ్ ప్రెసిడెంట్‌సురేంద్రనాథరెడ్డి,సుబ్రమణ్యం, కోశాధికారి జయచంద్రనాయుడు, డాక్టర్ ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, మహేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## అక్షర కోచింగ్‌సెంటర్ విజయకేతనం



పీలేరు, మార్చి 31 ప్రభాతవార్త: 2023-2024 సంవత్సరానికి జరిగిన పీలేరు అక్షర కోచింగ్ సెంటర్ విద్యార్థులు అర్హత సాధించారు. అందులో వెంకట కార్తికేయ, చాత్విక్‌రెడ్డి, ఆదిత్య, గురుగోవర్ధన్‌లు అర్హత సాధించి నట్లు కోచింగ్‌సెంటర్ నిర్వాహకులు విజయగోపాల్‌రెడ్డి తెలిపారు.నలుగురు విద్యార్థులు అర్హత సాధించారు. గత 10 సంవత్సరాలుగా అక్షర కోచింగ్ సెంటర్ నుంచి నవోదయ, సైనిక్‌స్కూల్ ప్రవేశపరీక్షలకు శిక్షణ తీసుకున్న విద్యార్థులు అర్హతలు పొందుతున్నారు.అర్హత సాధించిన విద్యార్థులను కరెస్పాండెంట్ విజయగోపాల్‌రెడ్డి అభినందించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కోచింగ్ సెంటర్ నిర్వాహకులను అభినందించారు.

## సిద్ధం సభలు విజయవంతం చేయండి



పీలేరు,మార్చి 31 ప్రభాతవార్త: మార్చి రెండవ తేదీన మదనపల్లెలో జరగనున్న మేము సిద్ధం సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాథరెడ్డి, పీలేరు, కేవి.పల్లె మండలాల ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పీలేరు, కేవి.పల్లె మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా మార్చి2వ తేదీ మంగళవారం మదనపల్లె పట్టణంలో జరుగనున్న సిద్ధం సభ కార్యక్రమానికి పీలేరు, కేవి.పల్లె మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సతీష్‌కుమార్‌రెడ్డి, మండలకన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డిలు, సర్పంచి జీనత్‌షఫీ, వైసీపీ నాయకులు హబీబ్‌బాషా, హుమయూన్, ఎన్‌వి.చలపతి, పెద్దోడు, స్టాంపుల మస్తాన్, కడప గిరిధర్‌రెడ్డి, చక్రదర్, , ద్వారకనాథరెడ్డి, తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీలేరు డిపో నందు ఐదుగురు పదవీవిరమణ చేశారు



పీలేరు, మార్చి 31 ప్రభాతవార్త: స్థానిక డిపోలో పనిచేస్తున్న ఐదుగురు ఆర్టీసీ ఉద్యోగులు ఆదివారం పదవీవిరమణ పొందారు. ఈసందర్భంగా డీఎం బండ్లకుమార్ ఆధ్వర్యంలో వారికి పూలమాలలవేసి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన వారు సైదుల్లా (కండెక్టర్), ఎస్.నజీర్( కండెక్టర్), రాజేంద్ర (డ్రైవరు), వాసు (డ్రైవరు), మెకానిక్ రమణలు పదవీవిరమణ పొందారు.డిపోలోనిఅన్నిఅసోసియేషన్లుకలిసిపదవీవిరమణ పొందిన వారిని సన్మానించారు. ఈకార్యక్రమంలో అన్ని యూనియన్ల ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే పదవీవిరమణ పొందిన వారి సేవలను కొనియాడారు.వారికిఆభగవంతుడుఆయురారోగ్య,అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని ఆదేవున్ని కోరుకున్నారు.

## వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నియామకం



పులివెందుల రూరల్, మార్చి 31, ప్రభాతవార్త : వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా వాల్మీకి సంఘ నాయకుడు అంబకపల్లె నారాయణస్వామిని నియమించారు. ఈ మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం నారాయణస్వామి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ తన మీద అపార నమ్మకంతో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ముస్లింలకు సముచిత స్థానం వైఎస్ఆర్‌సీపీతోనే సాధ్యం



వేంపల్లె, మార్చి 31, ప్రభాతవార్త :
రాష్ట్రంలోని ముస్లింలకు సముచిత స్థానం వైఎస్ఆర్‌సీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిసార్‌బాషా వెల్లడించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అన్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ అధినేత ముస్లింలకు ఐదు ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని, టీడీపీ ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వకపోవడం దారుణం అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ అధినేత ఏడు ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారన్నారు. కానీ టీడీపీ కేవలం 2 సీట్లు మాత్రమే ప్రకటించిందని ఆయన అన్నారు. వైఎస్ఆర్‌సీపీ నవరత్నాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. హామీలను విస్మరించిన చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ముఖ్యంగా ముస్లింలు బాబును నమ్మరని ఆయన వివరించారు.

## పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు సన్మానం

పులివెందుల రూరల్, మార్చి 31, ప్రభాతవార్త : పులివెందుల ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఆదివారం డిపోలో ఘనంగా సన్మానించారు. ఎంసీగా విధులు నిర్వహించిన రాజు, రామ్మోహన్‌రెడ్డిలు ఆదివారం పదవీ విరమణ పొందారు. వీరికి సిబ్బంది, సహ ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## మానవత భవనానికి విరాళం



వేంపల్లె, మార్చి 31, ప్రభాతవార్త : వేంపల్లెలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన భవన నిర్మాణానికి రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ కవి వరప్రసాద్ స్వచ్ఛందంగా విరాళం ప్రకటించారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో జరిగిన మాసాంతర సమావేశంలో ఆయన కమిటి సభ్యులకు నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో జరిగే వివిధ సేవా కార్యక్రమాలు హర్షణీయమని కొనియాడారు. మానవత ఛైర్మన్ బి.చక్రపాణిరెడ్డి, సహాయ ఛైర్మన్ కావలి క్రిష్ణతేజ, అధ్యక్షుడు చల్లా బాలాజిలు దాత కవి వరప్రసాద్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు కావలి ముత్యాలయ్య, డైరెక్టర్లు రంగారెడ్డి, డాక్టర్ రాజారాం, కోశాధికారి శ్రావణ్, సభ్యులు శ్రీకళ, అనీల్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్, డాక్టర్ అరుణ్, గోపి, చందు, మణి, వినయ్, ప్రసన్న, ప్రదీప్, రాహుల్, చెంద్రాయుడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్ అరెస్టు అక్రమం

వేంపల్లె, మార్చి 31, ప్రభాతవార్త : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టు అక్రమమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటరు రహంతుల్లా ధ్వజమెత్తారు. ఆదివారం వేంపల్లెలోని ఆ పార్టీ కార్యాలయంలో కేజ్రీవాల్ అరెస్టుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ కుట్రపూరితంగా ఈడీ, సీబీఐలను ప్రతిపక్షాలపై ప్రయోగిస్తోందన్నారు. ఎన ఇనకల సమయాన తమ పార్టీని దెబ్బ తీసేందుకు కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని ఆరోపించారు. కేజ్రీవాల్ అక్రమ అరెస్టుతో బీజేపీ పతనం కాక తప్పదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కన్వీనరు దాదాపీర్, పీర్‌బాషా, షఫి, అహమ్మద్, ఖదీర్, సిద్దిక్, తదితరులు పాల్గొన్నారు.



## బీసీలంటే బ్యాక్‌వర్డుక్లాసెస్ కాదు... బ్యాక్ బోన్ క్లాసెస్



పీలేరు, మార్చి 31 ప్రభాతవార్త: నియోజకవర్గం పరిధిలోని వాల్మీకిపురంలో మండల బీసీ సెల్ బాలే శేఖర్ వల్లిగట్ల రమణ,మాజీ ఎంపీపీ, మండల తెదేపా అధ్యక్షులు గుర్రం మల్లికార్జునరెడ్డి, అధ్యక్షతన స్థానిక తెదేపా కార్యాలయంలో జయహోబీసీఅనేకార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈకార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు బాలే శేఖర్ మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్‌కళ్యాణ్ కలిసి నిర్ణయించిన జయహో బీసీ డిక్లరేషన్‌ని కార్యకర్తలతో పంచుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాందీపేట రమణ, చింతపర్తి సర్పంచి మహిత శేషాద్రిరెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షులు బోయపల్లె రామమూర్తి, సయ్యద్ , భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, చంద్రారెడ్డి, మధు, జయచంద్ర, జమీర్, లక్ష్మీనారాయణ, బాలాజీ, యల్లారెడ్డి, మహేష్‌ప్రభు, మోహన్, చిరు, జాహ్నవి, తెదేపా, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మతల్లికి ఘనంగా పూజలు



లక్కిరెడ్డిపల్లె,మార్చి 31,ప్రభాతవార్త:
మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు.జాతరను మురిపించే లా భక్తులు గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ ఆదివారం రెండవ వారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు,పూజలు నిర్వహించారు.ఉదయం నుంచి జాతరలో జనం పోటెత్తారు క్యూలైన్లు కిక్కిరిచాయి,జాతర ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.చిరువ్యాపురులు,బెల్లపుచెరుకులు,గంగమ్మ జాతరలో ఆనవాయితొ గంగమ్మ జాతరలో భక్తులు ఇబ్బందులు-పడకుండా చలువపందిళ్లు త్రాగు నీరు అన్ని ఏర్పాటు చేశారు.వచ్చిన భక్తులకు సెల్లు వంశీయులు యాదవులు గంగయ్య చంద్రశేఖర్ యాదవ్లు అర్చకులు ఒక చిన్న భక్తులకు అమ్మవారిని ప్రత్యేకంగా లభించి దర్శనభాగాన్ని కల్పించారు అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతి ప్రసాద్ యాదవ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై 705 ఫిర్యాదులకు 669 పరిష్కారం



**- రూ. 1.19 కోట్లు విలువైన నగదు లిక్కర్ ఇతర వస్తువులు సీజ్**
**- జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్**

రాయచోటి, మార్చి 31, ప్రభాత వార్త :
జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 705 ఫిర్యాదులు అందగా 669 ఫిర్యాదులకు పరిష్కారం అందించాలమని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాయచోటి కలెక్టర్ నందు జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేంద్రం ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించి వేర్వేరు ఫిర్యాదుల వేధిక ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం జరరఉగుతుంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 705 ఫిర్యాదులలో 669 ఫిర్యాదులను పరిష్కరించగా 36 ప్రగతిలో ఉన్నాయి.

## దూదేకుల సంఘం ఆధ్వర్యంలో నూర్ భాషా రంజాన్ తోఫా

ఫోటో:రైల్వేకోడూరు అర్బన్,మార్చి 31,ప్రభాతవార్త:
రైల్వేకోడూరు మండలం స్థానిక పట్టణంలో ని ఎస్ వి జూనియర్ కాలేజీ వెనుక బాగాన నివాసం ఉంటున్న పేద ముస్లిం సోదరులకు రైల్వేకోడూరు నూర్ భాషా దూదేకుల సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సంఘం యువ నాయకుల సహకారంతో రంజాన్ పండుగ పురస్కరించుకుని పండగకు అవసరమైన ఏడు నిత్యవసర సరుకులైన సేమియా,గోధుమపిండి,నెయ్యి,నూనే,చక్కెర,బియ్యము,సగ్గుబియ్యము లను పంచి పెట్టారు.అనంతరం రంజాన్ శుభాకాంక్షలు ఈద్ ముబారక్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నూర్ భాషా సంఘం గౌరవ అధ్యక్షులు సుంకేసుల సుభాన్,యువ నాయకులు బోధనపు అజార్,బోధనపు రిజ్వార్ బాష,సుంకేసుల సాయి,భాషా,బారాషా,మొదలైన వారు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్యారెంటీలు.. విజయానికి సోపానాలు



వేంపల్లె, మార్చి 31, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 9 గ్యారెంటీలు విజయానికి సోపానాలు అని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీ పథకాలతో కర్ణాటకలో, ఆరు గ్యారెంటీ పథకాలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందన్నారు.ప్రస్తుతం9 గ్యారెంటీ పథకాలతో ఏపీలో కాంగ్రెస్ పార్టీలోకి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజలంతా లబ్ధి పొందేందుకు వచ్చేఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

## సమాధిని గెలిచిన సత్యవంతుడు ఏసుక్రీస్తు- పాస్టర్ మహేష్



కడప వైద్యవిభాగం, మార్చి 31, ప్రభాతవార్త: నగరంలోని 48వ డివిజన్ కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీట్ పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రజల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు త్యాగం మానవాళికి రక్షణ అని సందేశం ఇచ్చారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరమై క్రీస్తు మార్గంలో నడవాలన్నారు. ఆదివారం తిరిగి మరణం నుంచి లేచాడని తెలిపారు. ఆయన మరణంలో కూడా విజేయుడని తెలిపారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పరీక్షలు ఏవైనా ఫలితాల్లో మురళి కోచింగ్ సెంటర్ విద్యార్థులదే హవా




రాయచోటి గ్రామీణ, మార్చి 31, ప్రభాతవార్త: పరీక్షలు ఏవైనా ఫలితాలు మాత్రం మురళీ కోచింగ్ సెంటర్‌కే సాధ్యమని మురళీ సైనిక్ నవోదయ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ సరితాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొన్న విడుదలైన సైనిక్ ఫలితాలలో అలాగే నేడు విడుదలైన జవహర్ నవోదయ పరీక్షా ఫలితాలలో మురళీ సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమె అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



మదనపల్లెక్రైం, మార్చి 31 ప్రభాతవార్త :
పట్టణ శివార్లలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బాదితుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మదనపల్లె-పుంగనూరురోడ్డులోని బసినికొండ వద్ద గంగమ్మజాతర శనివారం రాత్రి ప్రారంభమైంది. ఈ జాతకు స్థానిక అగ్గిపెట్టెల ప్యాక్టరీవద్ద నివాసం ఉన్న శంకర్(48)తన భార్యతో కలసి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి దంపతులు నడుచుకొంటూ ఇంటికి వస్తుండగా తట్టివారిపల్లెకు చెందిన అమృత్‌కుమార్(20) ద్విచక్రవాహనంలో రోడ్డుపక్కన నడిచివస్తున్న దంపతులను రింగ్‌రోడ్డు వద్ద ఢీ కొన్నాడు. ప్రమాదంలో దంపతులతో పాటు అమృతకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వీరిని స్థానికులు ఆటోలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం పరిస్థితి విషమించడంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఘటనపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాయచోటి వైసిపిలో కష్టపడే వారికి గుర్తింపు లేదు

**- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు - రాష్ట్ర స్థాయి పదవులన్నీ ఆయనకే**
**- పార్టీ ఆవిర్భావం నుండి జెండాలు మోసి కేసులు నానా అవస్థలు పడ్డాం**
**- గుర్తింపు లేనిచోట ఇమడలేకనే స్వచ్ఛందంగా బయటకొచ్చాం - మీడియా సమావేశంలో మదన్‌మోహన్‌రెడ్డి**



రాయచోటి, మార్చి 31, ప్రభాత వార్త :
రాయచోటి వైసిపిలో పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు లేదని, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తూ తోటి నాయకులు, కార్యకర్తలను అనగదొక్కుతూ సెకండ్ కేటగిరీ నాయకులను ఎదగనివ్వకుండా చేస్తున్నారని, రాష్ట్ర పదువులు అన్నీ ఆయనకే తీసుకొని పార్టీ విజయం కోసం కష్టపడి కేసులు పెట్టుకుని వారిని గాలికి వదిలేశారని వైసిపి యువజన విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి. మదన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఆరుగాలం పార్టీ కోసం కష్టపడ్డా ఈ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఉన్నంతకాలం పార్టీలో మనుగడ లేదంటూ ఆవేదనతో పార్టీ సభ్యత్వంతో పాటు వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసి మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడిగా ఉన్న సమయంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పటి నుండి పార్టీ కోసం పోరాటాలు చేసి ధర్నాలు రాస్తారోకో, ఉద్యమాలు చేసి ఎన్నో కేసులు పెట్టించుకుని పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేసినప్పటికీ తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుంది అనేది విషయాన్ని పక్కన పెడితే ముందుగా ఎమ్మెల్యే వద్ద సొంత పార్టీలో ఇమడలేకనే స్వచ్ఛంధంగా పార్టీ నుండి బయటికి వస్తున్నామని ఆయన చెప్పారు. భవిష్యత్తులో ఏమి చేయబోతున్నాం అనే విషయాన్ని రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తామని ఆయన అన్నారు

## కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 31, ప్రభాతవార్త: స్థానిక డ్రైవర్ కొట్టాలలో నివాసం ఉంటున్న బాలవాసు(37) అనే కానిస్టేబుల్ ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కానిస్టేబుల్ బాలవాసు కలమల్ల పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్నాడు. 2023 డిసెంబరులో పులివెందులలోని నగరిగుట్టవీధిలో తన భార్య జానకీని గొంతు నులిమి హత్య చేశాడు. ఈ కేసులో పులివెందుల పోలీసులు బాలవాసును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతనిపై కేసు నమోదు కావడంతో పోలీసు ఉన్నతాధికారులు అతన్ని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో రిమాండ్‌లో ఉన్న అతను వారం రోజుల క్రితం బెయిల్‌పై బయటికి వచ్చాడు. డ్రైవరు కొట్టాలలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యను చంపాననే బాధతో రోజూ అతనఉ మదనపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు.

## ప్రజలకు సుపరిపాలన కొనసాగాలంటే వైసీపీ అధికారంలోకి రావాలి



పోరుమామిళ్ల , మార్చి 31 ప్రభాతవార్త :
ప్రజలకు సుపరిపాలన కొనసాగాలంటే వైసీపీ అధికారంలోకి రావాలని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ బూత్ కన్వీనర్‌ల సమన్వయకర్త రమణారెడ్డి ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా పోరుమామిళ్లలోని మహర్షి పాఠశాల నుంచి పాత పోస్టాఫీసు వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సుధను, ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలనిఅభ్యర్థించారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వేల కోట్ల రూపాయల డ్వాక్రా రుణాలను మాఫీ చేసి మహిళ ల ఖాతాల్లో జమచేసి ఇచ్చిన మాటను నెరవేర్చామన్నారు. మహిళలను మహారాణులను చేయాలనే ఉద్దేశంతో వారికోసం జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూతలాంటి పథకాల ద్వారా వేలాది రూపాయలు వారి అకౌంట్లలో జమచేశామన్నారు. ఒక్క జగన్‌ను ఓడించేందుకు అన్ని పార్టీలు ఏకమయ్యాయని , అవినీతి రహితంగా పాలించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. మరోసారి ముఖ్యమంత్రి జగన్‌ను చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆప్కాస్ చైర్మన్ కళ్యాణ చక్రవర్తి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపపీలు బాష, రాజశేఖర్, ఉప సర్పంచ్ రాళ్లపల్లి రవికుమార్, నరసింహులు, రంగసము ద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, హనుమంతు రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజీవ్ బాష, హబీబ్, చాపాటి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టర్‌లకు ఎన్జీవోస్ సన్మానం



ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 31, ప్రభాతవార్త: దేశ వ్యాప్త వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపిన ప్రొద్దుటూరు వనితలకు ఆదివారం ఎన్జీవో హోంలో సన్మానించారు. ఏపి నాన్ గేజిటెడ్ మరియు గేజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌ఆధ్వర్యంలో అధ్యక్షులు కేజె రఘురామిరెడ్డి అధ్యక్షతన 2024 ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ వెయిట్ లిఫ్టింగ్ మరియు పవర్ లిఫ్టింగ్ నందు ప్రొద్దుటూరు డిస్ట్రిక్ హాస్పిటల్స్ నర్సింగ్ ఆఫీసర్స్‌గా పనిచేస్తున్న బి.మానస 52కేజీలవిభాగంలో పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడల్ అలాగే 55కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో మరిక గోల్డ్ మెడల్ సాధించారు. మరొక నర్సింగ్ ఆఫీసర్ షేక్ ఫాతిమా పవర్ లిఫ్టింగ్ విభాగంలో 4వ స్థానంలో నిలిచారు. వారి ప్రతిభనుగుర్తించి సన్మానించారు. ఈ సంధర్బంగా అధ్యక్షులు మాట్లాడుతూ వారు ఇరువురు జాతీయ స్థాయిలో ఇంత గొప్పగా రానించడం చాలా గొప్పగా ఉందన్నారు. వీరు ఇద్దరు ఇంత స్థితికి వచ్చినారంటే వారి తల్లిదండ్రుల ప్రోత్సాహంగొప్పదని అన్నారు. చివరిగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఇంత గొప్పగా మమ్ములను గౌరవించి సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి ప్రొద్దుటూరు తాలుకా అధ్యక్ష కార్యదర్శులు కేజె రఘురామిరెడ్డి, జె.రామసుబ్బయ్యలుసన్మానించారు. ఈ కార్యక్రమంలో వారి కార్యవర్గ సభ్యులు అసోసియేట్ ప్రెసిడెంట్ సధాశివయ్య, వైస్‌ప్రెసిడెంట్ శివ రామానుజ. సంధ్యారాణి, జయంతికుమారి, నాగరాజు, ఉమెన్‌వింగ్ జాయింట్ సెక్రటరీ సంధ్య, అశోక్,పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నారెడ్డి, సెక్రటరీ వెంకటయ్య, టి.సురేష్, లక్షుమయ్య, రామసుబ్బారెడ్డి, నాగన్న, దేవానందు, లక్ష్మినారాయణ, యం.పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి తెలియని రైల్వేకోడూరు



ఫోటో:విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు
ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు.రైల్వేకోడూరు నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎటువంటి అభివృద్ధి సాధించలేదని బిజెపి నాయకుల పణతల సురేష్,గడ్డం చెంగల్ రాజులు విమర్శించారు.ఆదివారం బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఇటీవల బీజేపీలో చేరిన మంగంపేట పారిశ్రామికవేత్త పులపుత్తూరి రామసుబ్బారెడ్డి బిజెపిలోకి రావడం శుభ పరిణామం అన్నారు ముఖ్యంగా 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో రైల్వేకోడూరు ని బిజెపికి కేటాయించాలని,తెలుగుదేశం నాయకుల సూచించారు.అదేవిధంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిక్షించేందుకు ఒక అవకాశం బిజెపికి ఇవ్వాలని వారు తెలిపారు.కోడూరు ప్రాంతంలో అక్రమ మైనింగ్ స్మగ్లింగ్ ఎక్కువ అయిపోతుందని వీటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జై ప్రకాష్ నారాయణ వర్మ,తోట శ్రీనివాసులు,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు పట్టణంలోని నూతన చర్చి నందు ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు,పంజం సుకుమార్ రెడ్డి,తోట శివసాయి పాల్గొన్నారు.పాస్టర్ బోధించినటువంటి ప్రవచనాలను వారు శ్రద్ధగా విన్నారు.అనంతరం పాల్గొన్న భక్తులకు ఈస్టర్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు భాను,సల్మాన్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

